క్లుప్తంగా

సీజ్ చేసిన వాహనాలకు 30న బహిరంగ వేలం

మైదుకూరు : మైదుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 30న సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధరకంటే ఎవరు ఎక్కువ పాడితే వారికి వాహనాన్ని సొంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు నీతి కథలు

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా మండల కేంద్రమైన రాజుపాళెంలోని గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు నీతి కథలు చెప్పినట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు. అందులో చెస్, క్యారమ్స్, పుస్తక పఠనం, ఆటలు ఆడించడంతో పాటు, పాటలు పాడించినట్లు ఆయన తెలిపారు.

టేకూరుపేటలో లైఫ్ స్టయిల్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం

పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేటలో లైఫ్‌స్టయిల్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం, దర్గాల ఆవరణలో గురువారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్త, చిత్తు కాగితాలు ఏరివేశారు. ఆవరణలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కరుణాకర్, వెంకటేష్, కిశోర్, స్ట్రైకింగ్ ఫోర్స్ పాల్గొన్నారు.

కేతవరంలో నేడు 'ఫ్యామిలీ డాక్టర్' శిబిరం

చాపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కేతవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నగరవనం పనులపై సమీక్ష

ప్రొద్దుటూరు క్రైం : అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న నగరవనం పనులపై గురువారం సబ్ డీఎఫ్‌ఓ ఎస్.దివాకర్ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఆర్థిక సంవత్సరంలో నగరవనంలో జంగిల్ క్లియరెన్స్ పని పూర్తి చేసి ప్రహరీ నిర్మాణం, నడక దారి, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో వివిధ అభివృద్ధి పనుల కోసం సహకరించదలచిన వారు ప్రొద్దుటూరులోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ సీహెచ్ దినేష్, అసిస్టెంట్ రేంజర్ అధికారి హేమాంజలి, బీట్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కాశినాయన : ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఛాయ్ సంస్థ ప్రతినిధి టి.మరియదాసు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వరికుంట్ల ఎస్సీకాలనీలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఓఎల్ఎఫ్ ఆసుపత్రి సిస్టరు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

ప్రొద్దుటూరు : చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే సంసిద్ధత కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆదిలక్షుమ్మ, నాగేశ్వరి తెలిపారు. స్థానిక టౌన్ బ్యాంకు బజార్‌లో ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు మెడ్జ్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సంసిద్ధత కార్యక్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను, జ్ఞాపకశక్తిని అభివృద్ధి పరచడమే లక్ష్యమని తెలిపారు. ప్రథమ్ సంస్థ సూపర్ ట్రైనర్ స్వరూపరాణి పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, ఎంఎస్ కేలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

26, 27న వేళాంగిణి మాత తిరునాల

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లెలో వెలసిన వేళాంగిణి మాత తిరునాల ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఫాదర్ దేవరాజు ఆధ్వర్యంలో దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 27న తెల్లవారుజామున 3 గంటలకు వేళాంగిణి మాతను పురవీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు.

భగవద్గీత భగవంతుని హృదయం

బ్రహ్మంగారిమఠం : భగవద్గీత భగవంతుని హృదయమని ప్రవచకులు చాపాడు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామం రామాలయంలో గురువారం టీటీడీ ధార్మిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో రమణాచారి, వెంకటరమణ, బ్రహ్మయ్య, రమణమ్మ, వరలక్ష్మి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక నెల్లూరురోడ్డులోని రాచపూడి నాగభూషణం ఫంక్షన్‌హాలులో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేకుండా అర్హత ఉన్న లబ్ధిదారుల వద్దకే వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర చాలా కీలకమని, వలంటీర్లు కూడా తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం సేవారత్న కింద ఐదుగురు వలంటీర్లకు , సేవామిత్ర కింద 98 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల అధ్యక్షుడు బోడపాడు రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు నరసమ్మ, ఓబులేసు, గంగమ్మ, ఉప సర్పంచ్‌లు కుప్పాలరమణ, రవికుమార్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఈఓపీఆర్డీ భానుప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లే కీలకం

అట్లూరు : సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లే కీలకమని, వారు పట్టుకొమ్మ లాంటి వారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వలంటీర్లకు ఎంపీడీఓ సుజాతమ్మ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను నెలకొల్పి సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం మండలంలో 101 మంది వలంటీర్లలో ఐదుగురికి సేవారత్న, 94 మందికి సేవామిత్ర ప్రశంసా పత్రాలతో పాటు సత్కరించారు. మండల అధ్యక్షురాలు పొత్తపి రమాదేవి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మణ్యం మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ శ్రీవాణి, అట్లూరు, వరికుంట, కుంభగిరి సర్పంచులు యల్లమ్మ, రమణయ్య గంగమ్మ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డెయ్య, పెంచల్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, రాజారెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

ఆకర్షణీయం.. స్వాగత తోరణం


టంగుటూరు జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

రాజుపాళెం : జాతీయ రహదారి–40పై టంగుటూరు మెట్ట (వీరమ్మ సత్రం) వద్ద ఏర్పాటుల చేసిన గ్రామ స్వాగత తోరణం ఆకర్షణీయంగా ఉంది. రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామ కావలి సంఘానికి సంబంధించిన నిధులతో పెద్దలు ఎంతో అద్భుతంగా ఈ తోరణాన్ని నిర్మించారు. ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులకు, ప్రజలకు ఆహ్వానం పలికేటట్లుగా తీర్చిదిద్దారు. ఆ గ్రామంలోని పురాతన దేవాలయాల్లో ఒకటైన సోమేశ్వర స్వామి సతీసమేతంగా, మదన గోపాల స్వామి, వినాయకుడు విగ్రహ మూర్తులను తోరణం పైభాగాన, తోరణానికి సంబంధించి ఇరువైపులా ఉన్న స్తంభాలకు అక్కడ నుంచి వచ్చే వారికి స్వాగతం పలికే విధంగా మహిళా మూర్తుల బొమ్మలను ఏర్పాటు చేశారు. ఆ తోరణాన్ని రూ.10.50 లక్షలతో నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ తోరణానికి లైట్లు వేయడంతో రాత్రి సమయంలో ఎంతో అందంగా కూడా కనిపిస్తోంది.

డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా చేయండి


మాట్లాడుతున్న పీడీ ఆనంద్ నాయక్

ప్రొద్దుటూరు : సంఘాల్లో ఉన్న డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డులో ఉన్న వైఎస్సార్‌కాంత్రి పథం మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రతి మండలంలో 25 మందిని వ్యాపార వేత్తలుగా చేయాలని టార్గెట్ విధించామన్నారు. గ్రూప్ ష్యూరిటీతోనే బ్యాంకుల్లో పర్సనల్ లోన్లు ఇస్తారని తెలిపారు. అలాగే గొర్రెల పెంపకానికి సంబంధించి 50 శాతం సబ్సిడీతో రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలని కోరారు. సమావేశంలో ఏపీఎం వెంకటసుబ్బమ్మ, సీసీలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

లే అవుట్ల పరిశీలన

ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా ఉన్న పీడీ ఆనంద్ నాయక్ గురువారం నియోజకవర్గంలో కొత్తగా వేస్తున్న లే అవుట్లను పరిశీలించారు. నిబంధనలను పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పీడీ వెంట ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఆంజనేయులుకు ఘన నివాళి


ఆంజనేయులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఈయూ నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న అంపావతిన ఆంజనేయులు ఈనెల 24న విజయవాడలో జరిగిన ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభకు హాజరై గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ప్రొద్దుటూరులో ఆంజనేయులు భౌతికకాయానికి ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదర్‌రావు, జీవీ నరసయ్య, జోనల్ కార్యదర్శి ఎస్.రాజశేఖర్, కడప జిల్లా కార్యదర్శి ఏఆర్ మూర్తి ప్రొద్దుటూరు డిపో కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి యూనియన్ రాష్ట్ర కమిటీ తరఫున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. విజయవాడ నుంచి ప్రొద్దుటూరుకు మృతదేహాన్ని తరలించేందుకు రూ.25వేలు కూడా యూనియన్ చెల్లించింది. ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని సెటిల్‌మెంట్స్ త్వరగా వచ్చేలా, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా యూనియన్ కృషి చేస్తుందని దామోదర్‌రావు, నరసయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డిపో ఈయూ కార్యదర్శి డి.గోపాల్, బీసీ శేఖర్, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మూలె రామమునిరెడ్డికి అష్టావధానానికి ఆహ్వానం



ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ మూలె రామమునిరెడ్డికి బెంగళూరులోని శ్రీ సత్యసాయి సేవాశ్రమంలో జరగనున్న అష్టావధానానికి ఆహ్వానం అందింది. ఈ నెల 28న ఆదివారం సాయంత్రం 4 గంటలకు బెంగళూరులో సత్యసాయి సేవా సంస్థ వారు నిర్వహించే అష్టావధానంలో పృచ్ఛకుడిగా నిషిద్ధాక్షరి అంశాన్ని నిర్వహించనున్నారు.

జూన్ 30 వరకు ప్రజలతో మమేకం

చాపాడు : ఈ నెల 30 నుంచి జూన్ 30వ తేది వరకూ కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందే లబ్ధిదారులను కలిసే కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుబ్బరాయుడు పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలో గురువారం సాయంత్రం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పరిపాలన పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

చదువుతో పాటు క్రమ శిక్షణ తప్పనిసరి

చాపాడు : విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ తప్పనిసరి అని ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయుడు అజీజ్ అహమ్మద్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి, నక్కలదిన్నె బీడీసీ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి


జిల్లా ఆస్పత్రిని సందర్శించిన జేవీవీ సమ్మర్ క్యాంప్ విద్యార్థులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక సమ్మర్ క్యాంప్ విద్యార్థులు గురువారం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రులను సందర్శించడం ద్వారా ఆరోగ్యం పట్ల విద్యార్థులకు శ్రద్ధ పెరుగుతుందన్నారు. ఆల్ట్రాసౌండ్ గురించి రేడియాలజిస్టు నాగరాజు విద్యార్థులకు వివరించారు. ఎముకలు, కీళ్లకు చేసే చికిత్స, ఎమర్జెన్సీ విభాగం, రక్తనిధి కేంద్రం, ఆపరేషన్ థియేటర్, మార్చురీ, జనరల్ వార్డు తదితర విభాగాలను విద్యార్థులకు చూపించారు. వాటిపై పిల్లలు అడిగిన ప్రశ్నలకు ఆయా విభాగాల సిబ్బంది వివరించారు. ఇలాంటి ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యార్థులు దేన్నైనా సులభంగా అర్థం చేసుకోగలుతారని, వారిలో సృజనాత్మకత పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ శివారెడ్డి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత, కార్యదర్శి కల్యాణ్‌కృష్ణ, కోఆర్డినేటర్లు హాసిని, అక్షయ, భరత్, జాహ్నవి, యోచిత, నిఖిల్, తేజేష్, జావిద్ పాల్గొన్నారు.

17 మూగ జీవాలు మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్

మైదుకూరు : మైదుకూరు మండలం కేశవాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని మిట్టమానుపల్లెకు చెందిన పేర్నపాటి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తనకున్న 300 జీవాలను కేశవాపురం సమీపంలోని పొలాల్లో రోజూ మేపుకొంటుండేవాడు. గురువారం మందలోని సుమారు 50 గొర్రెలు ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యాయి. వాటిలో 17 మృతి చెందాయి. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తన సిబ్బందితో వచ్చి అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స చేయగా 30 గొర్రెలు కోలుకున్నాయి. గొర్రెల మృతికి కారణాలు తెలియరాలేదు. మృతి చెందిన జీవాలకు డాక్టర్ సుధాకర్ సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్ రెడ్డి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నమూనాలు సేకరించి పరీక్షకు పంపారు. మిగిలిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది యశోద, హుస్సేన్, చిన్న సుబ్బరాయుడు యాక్టివేటెడ్ చారుకోల్ ద్రావణాన్ని తాపించారు. ఈనెల 19వ తేదీ మండలంలోని పోతిరెడ్డిపల్లెకు చెందిన మీగడ శివారెడ్డికి చెందిన 9 జీవాలు విష ద్రావణాన్ని తాగి మృతి చెందిన విషయం తెలిసిందే.

జీపు జాతా కరపత్రాలు విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం కార్మికుల సమస్యలపై ఈనెల 31న చేపట్టే జీపుజాతా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న హిందూపురం నుంచి విజయవాడకు, ఇచ్ఛాపురం నుంచి విజయవాడకు రెండు జీపుజాతాలు ప్రారంభమవుతాయని తెలిపారు. జూన్ 3న ప్రొద్దుటూరుకు జీపు జాతా వస్తుందని, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయకుమార్, రవికుమార్, జాకోబ్, గురమ్మ, ప్రమీలమ్మ, సీతమ్మ, రమాదేవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు కేటాయించాలి


టి.సండ్రపల్లెలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీలు ఇస్తున్న దృశ్యం

గోపవరం : త్వరలో జరగబోయే అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అర్హులైన నిరుపేదలకు భూములు ఇవ్వాలని ఎస్.రామాపురం దళితులు గురువారం స్పందనలో అర్జీలు ఇచ్చారు. టి.సండ్రపల్లె సచివాలయంలో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజుతో పాటు అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.రామాపురం దళితవాడకు చెందిన 37 మంది దళితులు అర్జీలు ఇచ్చారు. భూములు ఉన్న వారికే తిరిగి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, సెంటు భూమి లేని నిరుపేదలైన తమకు అసైన్‌మెంట్ కమిటీలో భూములు కేటాయించాలని దళితులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకాధికారి నాగరాజుతో పాటు తహసీల్దార్ దామోదర్ రెడ్డి స్పందిస్తూ ఇచ్చిన అర్జీలను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న వుట్టి నాగశయనం

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాంగ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పెంచామని దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం పేర్కొన్నారు. దేవాంగ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 300పైన మార్కులు, స్థానికంగా ఇంటర్ చదివి ప్రతి గ్రూపులో 700 పైన మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులు ఈ ప్రతిభా పురస్కారాలకు అర్హులన్నారు. వీరికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు, కన్సొలేషన్ బహుమతిగా రూ.2వేలు అందిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులకు జూన్ 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారుడు సందు శివనారాయణ, ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు మచ్చా వెంకట సుబ్బరాయుడు, పోసా వేణుగోపాల్, కాటం వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం


స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు కార్యక్రమానికి తీసుకువస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జరగనున్న కల్యాణం సందర్భంగా గురువారం రాత్రి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పెళ్లి పెద్దలుగా ఉండి ఎదుర్కోలు తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించి సాయంత్రం హనుమంత వాహన సేవ నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలి


భగవద్గీత శ్లోకాల పోటీలో బహుమతులు అందుకున్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని కైవల్యసత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కైవల్యతీర్థస్వామి పేర్కొన్నారు. స్థానిక లైటుపాలెం సెంటర్‌లోని ఎంబీఎస్ ధ్యాన కేంద్రంలో గురువారం వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం ద్వారా మంచి చెడు తెలియడంతో పాటు భక్తి అలవడుతుందన్నారు. శ్లోకాల పఠన పోటీలో కిడ్స్ విభాగంలో ప్రథమ బహుమతి అభిరామ్, ద్వితీయ బహుమతి కృషిత, జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి అర్పిత, ద్వితీయ బహుమతి ఉమేష్‌చంద్ర గెలుపొందారు. వీరికి కైవల్య సత్సంగ్ భవన యజమాని మాలెపాటి సునీల్ బహుమతులు అందజేశారు.

కమనీయం.. కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

బి.కోడూరు : మండలంలోని అనుమోరుపల్లె గ్రామంలో కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం వేదపండితులు బుజ్జిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తిలకించారు. స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం గ్రామస్తులు వేదపండితులు బుజ్జిస్వామి దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.